# ప్రశ్నలోని సమాధానం

**- పెన్మెత్స శ్రీకాంత్‌రాజు**

ప్లాట్‌ఫాం మీద అప్పటికే వచ్చి ఉన్న ట్రయినుని చూసి, హడావుడిగా కౌంటర్‌లో టిక్కెట్ తీసుకుని, దాదాపు పరిగెడుతున్నట్టుగా ట్రయినులో ప్రవేశించింది మానస.

"హమ్మయ్య! లేటయింది, ట్రయిను మిస్సవుతుందేమో అనుకున్నాను, కాని లక్! అలా జరగలేదు..." అనుకుంటూ కిటికీ ప్రక్క సీట్లో కూర్చుని తన బ్యాగ్ సీటు క్రిందకు తోసి, వాటర్ బాటిల్ అందుకుని రెండు గ్రుక్కలు నీళ్ళు త్రాగి... కొడుకు అనిరుధ్ వైపు చూసి... "అనీ... మంచినీళ్ళు తాగుతావా?!..."అని అడిగింది.

"వద్దు మమ్మీ..." అన్నాడు అనిరుధ్.

వాటర్ బాటిల్ ప్రక్కన పెట్టేసి... వెనక్కు జారి రిలాక్స్ అవసాగింది మానస.

ఆరోజు ఉగాది పండుగ కావటంవలన ఆ ఫాస్ట్ పాసింజరు రద్దీగా లేదు. సీటుకు ఒకరిద్దరు మాత్రమే ఉన్నారు. ఆ వసంతకాలపు సాయంత్రాన గాలి ఆహ్లాదంగా వీస్తు మనసుకు, శరీరానికి హాయినిస్తోంది.

ట్రయిను కదిలింది.

"ఎక్కడి వరకు?!..." ఎదురు సీట్లో కూర్చున్న ఓ యాభై ఏళ్ళావిడ చదువుతున్న పుస్తకం లోంచి తలెత్తి అడిగింది చిరునవ్వుతో.

మానస చెప్పింది.

వృద్ధాప్యపు ఛాయలు ఇపుడిపుడే ఆమె ముఖంపైకి ప్రసరిస్తున్నాయి.

బొట్టులేని నుదురు... మెడలో వ్రేలాడుతున్న శిలువ... ఆమె క్రిస్టియన్ అని చెప్పకనే చెబుతున్నాయి. ఆ మహిళ మరలా తల వంచుకుని బైబిల్ చదువుకోసాగింది.

మానస భర్త మహేష్ మెడికల్ రిప్రజెంటేటివ్. తన తండ్రికి ఆరోగ్యం సరిగ్గా లేదని చూసివద్దామని పుట్టింటికి వచ్చింది మానస. పండగ రెండ్రోజుల్లో ఉండటంతో, తల్లితండ్రీ బలవంతపెట్టడంతో అక్కడ ఉండిపోవాల్సి వచ్చింది. ఈరోజు ఉదయం పండుగ జరుపుకుని ఇపుడు సాయంత్రం తన భర్త దగ్గరకు ప్రయాణమైయింది.

మానసకెదురుగా కూర్చున్నావిడ సెల్‌ఫోను రింగయ్యింది.

"ఆ నేనే కృపావతిని మాట్లాడుతున్నాను. ఆ... ట్రయినులోనే ఉన్నాను. ఇప్పుడు ఐదయింది. అక్కడికి చేరేసరికి రాత్రి పన్నెండవుతుందేమో! ఆ...అలాగే, చేరటానికి ముందు రింగిస్తాను. ఉంటాను..." ఆవిడ ఫోను పెట్టేసి మానస వైపు చూసి నవ్వింది. "మా అన్నయ్య..." అంది. మానస కూడా నవ్వి... అడిగింది... "మీరే ఊరెళ్ళాలి... ఆంటీ?!..." ఆవిడ చెప్పింది.

"అబ్బో చాలా దూరమే..." అంది మానస.


"మా అన్నయ్యకు చర్చ్ ఉంది. అక్కడ సువార్త కూటములు జరుగుతున్నాయి. అందుకే వెళుతున్నాను అక్కడికి..." చెప్పిందావిడ.

ట్రయిను ఏదో స్టేషనులో ఆగింది. నలుగురు మనుషులు వచ్చి కూర్చున్నారు ఖాళీగా ఉన్నచోట్లలో.

అరటి పళ్ళు అమ్మొస్తే కొంది మానస.

"తీసుకోండి ఆంటీ..." అంటూ ఓ అరటిపండు కృపావతికి ఇవ్వబోయింది.

"వద్దు బేబీ నాకు షుగరు..." సున్నితంగా తిరస్కరించింది, కృపావతి.




మానస కృపావతిని గమనించసాగింది. ఆవిడ పర్స్‌నిండా చిల్లర ఉంది. వచ్చి అడిగిన ప్రతి బిచ్చమెత్తేవారికి లేదనకుండా డబ్బులివ్వసాగిందామె. ట్రయిను మళ్ళీ కదిలింది.

"ఆంటీ...ఇందాక మీరు కూటమి అన్నారు కదా! ఏం చేస్తారక్కడ..." అడిగింది మానస కుతూహలంగా.

"దైవజనులు శాంతి సందేశం ఇస్తారమ్మ. ప్రభువైన ఏసు పాపులమైన మనందరికోసం తన రక్తాన్ని చిందించి... మన పాప భారాన్ని మోయడానికి ఎలా ప్రయత్నించాడో వివరిస్తాను. పేదలకు వస్త్రదానం... అన్నదానం లాంటివి జరుపుతారు... " చెప్పింది కృపావతి.

చాలా ఆసక్తిగా ఆవిడ చెప్పింది విని అడిగింది మానస... "ఇలా చెయ్యటానికి ఇతర దేశాలనుండి ఫండ్స్ వస్తుంటాయా?!..."

"ఇదివరకైతే వస్తుండేవి. ఇప్పుడు ఏవో నిషేధాలు ఉన్నాయట..."

"అలాగా..." అంది మానస.

మానస కుతూహలం చూసి ఆవిడ కొనసాగించింది..." జీసస్ శరణు పొందిన వాళ్ళందరూ రక్షించబడతారు. ఆయన రెండవ రాకడ వేళ ఆయన విశ్వాసులు కాని వారికి రక్షణ ఉండదు..."

కృపావతి మాటలు మనసుకు రుచించలేదు.

"అదేమిటాంటీ! విశ్వసించనంత మాత్రాన రక్షణ ఉండదంటే ఎలా?! తనను విశ్వసించని వారైనప్పటికీ... మంచివారైతే దేవుడు రక్షించాల్సిందే కదా!..."

"నమ్మని వారిని ఆయన ఎలా రక్షిస్తాడు?! అడిగితేనేగా అమ్మయినా పెట్టేది! రక్షణ కావాలనుకున్నవారు నమ్ముతారు. నా రక్షణకోసం నేను నమ్ముకున్నాను అంతే..." అందావిడ కించిత్ అసహనంగా.

"అవునాంటీ ఎవరి నమ్మకంవారిది... ఆ నమ్మకం నిజం అవునో, కాదో తెలుసుకోగలగటం మనుషులకు... అందునా మనలాంటి వారికి సాధ్యం కాదు..." చాలా క్యాజువల్‌గా అంది మానస.

కృపావతి ముఖం కోపంతో జేవురించింది.

"నీకు తెలియదేమో కాని నాకు తెలుసు. ఏసే దేవుడు. రక్షకుడు. ఇప్పుడు నువ్వు నాతో వాదించిందంతా దేవుడి చిట్టాలో నమోదవుతుంది..." కృపావతి బెదిరింపుగా అంది.

"తప్పొప్పుల చిట్టా ప్రతి దేవుడి దగ్గరా ఉంటుంది. అయినా ఆ కరుణామయుడికి కోపం వచ్చేటంత తప్పేం చేసానాంటీ?! జీసస్ అంటే నాకు చాలా గౌరవం. ప్రేమకు ఆయన ప్రతీక! కాని హిందూ కుటుంబంలో పుట్టడంవలన ఈశ్వరుడు, శ్రీకృష్ణుడులాంటి దేవుళ్ళను ఆరాధిస్తున్నాను..." మానస మాటలకు అడ్డొస్తూ... అంది కృపావతి... "జీసస్‌ను విశ్వసించని వారికి దేవుని రాజ్యమైన పర లోకంలో చోటుండదు..."

"మీకు పరలోకంలో మాకు స్వర్గలోకం ఉంది. చాలా సినిమాలలో స్వర్గం ఎలా ఉంటుందో మీరు చూసే ఉంటారు. మా స్వర్గంలో మంచివాళ్ళమయితే మాకు తప్పక చోటుంటుంది..."అంది మానస నవ్వుతూ...

ఈ సంభాషణ అంతా వింటున్న ఓ గళ్ళచొక్కా అతను... "మంచితనం దైవ స్వరూపం. ఎవరు మనోవాక్కాయ కర్మలతో ఏ జీవినీ బాధపెట్టరో వాళ్ళు దేవుడి కృపకు పాత్రులవుతారు. ఆ దేవుడు కొందరికి అల్లా, కొందరికి జీసస్, కొందరికి శ్రీకృష్ణుడు..."

"అసలు ఏ మతమైనా హేతువాదుల వాదం ముందు నిలబడలేదు. వేలెత్తి చూపించుకోవటం

మొదలుపెడితే లోపాలు కోకొల్లలు ఏ మతంలోనైనా పరమత సహనం అనేది భారతీయుల రక్తంలోనే ఉంది. అదే అనేక జాతులను ఈ ఉపఖండం మీద కలిసిమెలిసి బ్రతికేలా చేస్తోంది...'' అన్నాడో నడివయ సాయన.

వీళ్ళతో చెప్పించుకోవటం చిన్నతనంగా అన్పించిన ట్టుంది మానసకు... ''పోన్లెండి ఆంటీ! ఆ టాపిక్ వది లేద్దాం! మీకూ నాకూ ఈ వాదనెందుకు...''అంది మానస.

''నేను వాదించలేదు... నామాట తీరే అంత...'' నవ్వింది కృపావతి.

ఏదో స్టేషనులో రైలు ఆగింది.

ఎవరో ఒక వ్యక్తి దూరంనుండి కృపావతిని చూసి గుర్తుపట్టి ట్రయిను కిటికీ వద్దకు వచ్చాడు.

''నువ్వా డానియేలు బాగున్నావా?!...'' అడిగింది కృపావతి.

''ఆ! దూరంనుండి చూసి నువ్వాకాదా అను కుంటూ వచ్చాను. ఎక్కడికి ప్రయాణం?!...'' అడిగాడు డానియేలు.

''అన్నయ్య దగ్గరకు. సువార్త కూడికలు జరుగుతు న్నాయక్కడ...''

''ఇక్కడ చర్చ్‌లో ఆదివారం పేదవాళ్ళకు భోజనాలు పెట్టి దుప్పట్లు పంచి పెడుతున్నాం. ఇది కరపత్రం. తెలిసినవాళ్ళెవరైనా ఉంటే ఇవ్వు...'' కృపావతికి నాలుగు కరపత్రాలిచ్చాడు డానియేలు.

''వద్దు...అవి నేను సరిఅయిన వ్యక్తులకు పంచక పోతే... పరలోకంలో ప్రభువుకు సమాధానం చెప్పుకో వాలి. ఈ రైలులో నాకు తగిన వ్యక్తులు దొరకకపో వచ్చు...'' తిరస్కరించింది కృపావతి.

ట్రయిను కదిలింది.

మానస తను వెంకటేశ్వరస్వామికి ఎంతటి భక్తు రాలో, ప్రతి శనివారం ఆయనను ఎంత నిష్ఠగా పూజి స్తుందో...ఆయన తన కష్టాలను ఎలా కడతేరుస్తు న్నాడో హృద్యంగా తోటి ప్రయాణీకులకు వివరించసా గింది... మధ్య, మధ్య క్రీగంటగా కృపావతి ముఖం లోని భావాలను గమనిస్తూ! కృపావతి మానస చెప్పేది వింటూనే, విననట్టు, బైబిల్ చదువుకుంటున్నట్టు నటిం చసాగింది. ఆమెని ఉడికించటానికి మరిన్ని అతిశయో క్తులు చెప్పసాగింది మానస.

ట్రయిను ఒక్కో స్టేషనుదాటి ముందుకెళుతోంది. జనం మరికాస్త పల్చబడ్డారు. మరో రెండు స్టేషన్ల తర్వాత మానస ప్రక్కన, కృపావతి ప్రక్కన కూర్చున్న వాళ్ళందరూ దిగిపోయారు.

మానస, కృపావతి ఎదురెదురు సీట్లలో మిగిలారు.

వాచ్ చూసుకుంది మానస. రాత్రి పదిగంటలు కావొస్తోంది. కిటికీలో నుండి బయటకు చూసింది. ''మనూరొచ్చేస్తోంది... లే...'' అంటూ కొడుకుని కుది పింది. సీటు క్రింద ఉన్న బ్యాగును బయటకు లాగి... సీటుమీదనుంచి కిటికీలోనుండి బయటకు చూడసా గింది మానస.

''అమ్మా...'' అంది కృపావతి ఉన్నట్టుండి... చేత్తో గుండెను నొక్కుకుంటూ... అటువైపు చూసింది మానస.

''హమ్మా... జీసస్...హా...హా...'' అంటూ కృపావతి కూర్చున్న చోటనే తోటకూర కాడలా జారిపోయింది.

ముందుకు జరిగి... ఆమెని పొదివి పట్టుకుని... ''ఏమయిందాంటీ?!...'' ఆదుర్దాగా అడిగింది మానస.

''నొప్పి...గుండెల్లో... హా... జీసస్... నా ప్రభువా?!...'' బాధతో మెలికలు తిరగసాగింది కృపా వతి.

''కంగారుపడకండి ఆంటీ... ఏం కాదు...'' ఆమె తలని తన ఒళ్ళో ఉంచుకుని... మెల్లగా గుండెలపై మసాజ్ చేస్తూ ధైర్యంచెప్పింది మానస.

కృపావతి నొప్పికి తాళలేక మూల్గసాగింది.

ఇంతలో ట్రయిను మెల్లగా ఆగింది.

''అరిగో... డాడీ. డాడీ... ఇటు...'' అంటూ పిల్చాడు అనిరుధ్. కొడుకు పిలుపు విని కిటికీ దగ్గరకు వచ్చాడు మహేష్. మానస ఒళ్ళోని కృపావతిని చూసి...''అరే... ఏమయిందావిడకు...'' అడిగేడు.

''హార్ట్‌స్ట్రోక్ అనుకుంటాను. మనం హెల్ప్ చేద్దాం. ఏదైనా హాస్పిటల్‌లో చేరుద్దాం...'' అంది మానస.

''ఈ చిన్న రైల్వేస్టేషనులో, స్టేషను హాస్పిటల్ లేదు. బయట ఏదైనా నర్సింగ్ హోంలో చేరుద్దాం...'' అన్నాడు మహేష్.

**మానస తను వెంకటేశ్వరస్వామికి ఎంతటి భక్తురాలో, ప్రతి శనివారం ఆయనను ఎంత నిష్ఠగా పూజిస్తుందో...ఆయన తన కష్టాలను ఎలా కడతేరుస్తున్నాడో హృద్యంగా తోటి ప్రయాణీకులకు వివరించసాగింది... మధ్య, మధ్య క్రీగంటగా కృపావతి ముఖంలోని భావాలను గమనిస్తూ!**

కంపార్ట్‌మెంట్‌లోకెక్కి బ్యాగ్ భుజానికి తగిలించు కున్నాడు మహేష్. మానస కృపావతి లగేజ్ పట్టు కుంది. మహేష్, మానస ఇద్దరూ కృపావతికి చెరోవైపు ఉండి... పొదివి పట్టుకుని స్టేషను బయటకు తీసుకొ చ్చారు.

ఆటోని పిలిచి... లగేజ్ వెనక వైపుపెట్టి... ఇద్దరిమ ధ్యలో కృపావతిని కూర్చోపెట్టుకున్నాక డ్రైవర్‌కు హాస్పి టల్ పేరు చెప్పి పోనీమన్నాడు మహేష్.

పండగరోజు కావటంతో హాస్పిటల్‌లో డాక్టర్స్ ఎవరూ లేరు.

''కొంచెం ఓర్చుకోండి ఆంటీ...మీకు ఏమీ పర్వా లేదు. కొంచెం లేటుగా వెళతారు మీ ఊరు అంతే!...'' ధైర్యం చెప్పసాగింది మానస.

మరొక హాస్పిటల్‌కు వెళ్ళారు. అక్కడ డాక్టరు రెసి డెన్స్ కూడా హాస్పిటల్ పైనే ఉంది. ఆటోలోనుండి కృపావతిని తీసుకుని విజిటర్స్ రూంలో కూర్చోపెట్టి, అక్కడి నర్స్‌ను డాక్టరును పిలవమని అడిగేడు మహేష్.

కాని అక్కడి నర్స్ డాక్టరు చూడనన్నారని చెప్పింది.

''నేను మెడికల్ రిప్రెజెంటేటివ్‌ని. డాక్టరుగారు నాకు బాగా తెల్సు... నేను మాట్లాడతాను...'' నర్సుతో చెప్పేడు మహేష్.

''మీరెళ్ళి డాక్టరుగారితో మాట్లాడి... ఎలా అయినా ఒప్పించి తీసుకురండి...'' చెప్పింది మానస.

మహేష్ హాస్పిటల్ పై భాగానికి వెళ్ళాడు.

''ఆంటీ, డాక్టరు వచ్చేస్తారు... ట్రీట్‌మెంట్ ఇచ్చేక నేను వచ్చి మీ ఊర్లో దింపుతాను. కంగారుపడొద్దు. కొంచెం ఓపిక పట్టండి...'' అంది మానస.

మూలుగుతూ తలాడించింది కృపావతి.

డాక్టరు లుంగీతోటే క్రిందకు వచ్చాడు. వెంటనే ఆమెని అడ్మిట్ చేసుకుని ఐ.సి.యులో ట్రీట్‌మెంట్ ప్రారంభించాడు.

మానస కృపావతి పర్స్‌లోని సెల్ తీసుకుని... వాళ్ళ బంధువులకు డయల్‌చేసి చెప్పింది... కృపావతి పరి స్థితి గూర్చి. వాళ్ళు వెంటనే బయలుదేరతామని చెప్పారు.

కుర్చీలో కూర్చుని వెనక్కి జారపడి కునికిపాట్లు పడుతున్న మహేష్‌ని చూసి... ''ఇబ్బంది పెట్టేనా?!...'' గిల్టీగా అంది మానస.

''ఇట్స్ ఓకే...'' అన్నాడు మహేష్ నవ్వుతూ...

''రాత్రి ఒంటిగంట అయింది. మీరు బాబుని తీసు కుని ఇంటికి వెళ్ళి ఉదయాన్నే రండి...'' అంది మానస.

''నువ్వు ఒక్కదానివే... ఇక్కడ...''

''ఈ హాస్పిటల్ మనింటికి దగ్గరేగా! నర్స్‌లు కూడా ఉన్నారు. నాకొచ్చిన భయం ఏమీలేదు. మీరు వెళ్ళండి...'' చెప్పింది మానస.

మహేష్ బయల్దేరాడు అయిష్టంగానే!

⁂

ప్రత్యూష కిరణాలు భూదేవి కప్పుకున్న మంచుదు ప్పటిని నులివెచ్చగా తాకి కరిగించేస్తున్నాయి.

రాత్రంతా నిద్ర లేక ముఖం పీక్కుపోయింది మాన సకు. కొద్దిసేపటి క్రితమే కృపావతి బంధువులు కూడా వచ్చారు. అందరూ ఐ.సి.యు ముందు ఆత్రుతగా ఎదురు చూస్తున్నారు.

ఇంతలో డాక్టరు వచ్చి... ''షి ఈజ్ అవుటాఫ్ డేంజర్... ఇంకో అరగంట ఆలస్యమైతే ఏమీ ఉప యోగం ఉండకపోను. బట్, గాడ్ ఈజ్ గ్రేట్. మీరా మెను చూడొచ్చు. మాట్లాడొచ్చు...'' అన్నాడు.

మానసతోపాటూ అందరూ ఆ గదిలో అడుగుపె ట్టారు. మానసని చూడగానే కృపావతి ముఖంలోకి కాంతి వచ్చింది. ఆమె కళ్ళు తడి అయ్యాయి.

''నీవల్లే బేబి, నేను ఇంకా బ్రతికున్నాను. నన్ను బ్రతికించాలని నువ్వు పడ్డ తాపత్రయం...శ్రమా... ఆదుర్దా... నేను నా జీవితంలో మరచిపోలేను. బేబి ఆ సమయంలో నీలో నాకు ప్రేమ స్వరూపుడైన జీసస్ కన్పించాడు. ఆ ప్రభువు నీ రూపంలో నాకు దర్శనమి చ్చాడు...'' కళ్ళు మెరుస్తుండగా నీరసం నిండి గొంతుతో ఆర్తిగా అంది కృపావతి.

''నాలో మీకు ఆ కరుణామయుడు కనిపిం చాడా?!...'' ఆశ్చర్యంగా అంది మానస. ''నేను వెంకటే శ్వరుడి భక్తురాలను కదా... జీసస్ ఈమెకు నాలా ఎందుక్కనిపిస్తాడు?!...'' అనుకుందామె.

మానస మాటలు కృపావతిని ఆలోచనలో పడే సాయి.

''తన విశ్వాసి కాని ఈమెలో నాకు ఆ జీసస్ ఎలా సాక్షాత్కరించాడు?!...'' విస్మయంగా అనుకుంది కృపా వతి.

ఏదో అర్థం అయి- అవనట్టుండటంతో ఇద్దరూ ఆలోచనలో పడ్డారు. తమ తమ ప్రశ్నల్లోనే సమాధానా లున్నాయన్న సంగతి విస్మరించి ఏదేదో ఆలోచిస్తూనే ఉన్నారు వాళ్ళిద్దరూ... ★


**రచయిత చిరునామా**

**పి.శ్రీకాంత్‌రాజు,**

ఇం.నెం.18-3-29, సత్తెమ్మ టెంపుల్ స్ట్రీట్,

అయోధ్యరామాపురం,

సామర్లకోట- 533 440, తూ.గో.జిల్లా.